ఘనంగా బాలల దినోత్సవం

రెబ్బెన: నవేగాం పాఠశాలలో..



దహెగాం: నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



కౌటాల: స్వాతంత్ర్య సమరయోధుల వేషాధారణలో బాలలు



జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులే టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. పలు పాఠశాలలో విద్యార్థులు చేసిన నృత్యం అలరించింది. విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఉపాధ్యాయులు సూచించారు. – సాక్షి, నెట్‌వర్క్



కెరమెరి: నృత్యం చేస్తున్న విద్యార్థులు



కౌటాల: కేజీబీవీలో..



పెంచికల్‌పేట్: పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

108లో ప్రసవం



బిడ్డను కుటుంబీకులకు అప్పగిస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బూరం వెంకటమ్మ అనే మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. 108 ఈఎంటీ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మహిళకు పురిటినొప్పులతో బాధపడుతున్న క్రమంలో కుటుంబీకులు 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్సులో దహెగాంకు తరలిస్తున్న క్రమంలో కర్జి, గిరవెల్లి మధ్యలో అంబులెన్స్‌లో ప్రసవించిందని తెలిపారు. అనంతరం దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగానే ఉన్నారని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

పూలు, దీపాలతో రావాలి



మాట్లాడుతున్న ప్రముఖులు

కెరమెరి: మండల కేంద్రంలో శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించే కార్తిక పౌర్ణమి సందర్భంగా కాకడా హారతులకు వచ్చే మహిళ భక్తులు పూలతో, దీపాలతో రావాలని అర్చకుడు కులకర్ణి బాపూదేవ్, ప్రముఖులు, సోనేరావు, సుభాష్, మాధవ్, శ్రీకాంత్ తెలిపారు. గురువారం శివాలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఆలయం ఎదుట దీపాలతో ఓం, స్వస్తిక్, శివలింగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

నేడు కాగడ హారతుల ముగింపు కార్యక్రమం



మంగళహారతులు ఇస్తున్న మహిళలు

కెరమెరి: మండల కేంద్రంలో శివాలయం కాకడ హారతులకు ముస్తాబైంది. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగిన కాకడ హారతులు నేటితో ముగియనున్నాయి. నేడు మండలంలోని సాంగ్వి పెద్దవాగుకు చేరుకుని నీటిలో ప్రమిదలు వదనున్నారు. అనంతరం గంగాదేవి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇంటిల్లిపాది ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకుంటారు.

జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపిక



ధూపం రాకేశ్

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన ధూపం రాకేశ్ గురువారం విడుదలైన గ్రూప్- 4 ఫలితాల్లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. రాకేశ్ గతంలో రైల్వే శాఖలో గ్రూప్-డితోపాటు జైలు వార్డెన్, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం కుంటలమానెపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు హనుమంతు, మంజుల సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా తులసీ కల్యాణం

ఆసిఫాబాద్‌అర్బన్: కార్తీక మాసంను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మణవాడలో తులసీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల చిత్రపటం పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు. జొన్నకర్ర, ఉసిరిక కొమ్మలకు పూజలు చేశారు.

ప్రహరీ నిర్మించాలి



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ నిర్మించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం మండలంలోని మోతుగూడ ప్రభుత్వ పాఠశాలను ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మండలంలోని అప్పపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారాం, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు మహర్దశ..!

- ప్రారంభమైన నూతన గదుల నిర్మాణం
- తీరనున్న విద్యార్థులు కష్టాలు
- ధనోరా పునరావాస కేంద్రంలో పనులు ప్రారంభం



రాంజీగూడలో ఆశ్రమ ఉన్నత పాఠశాల

కెరమెరి: గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న విద్యార్థుల, ఉపాధ్యాయుల కష్టాలకు ఇక చెక్ పడనుంది. నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో త్వరలో కష్టాలు తీరనున్నాయి. మండలంలోని సావర్‌ఖెడా గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజీగూడలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొత్తం 113 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఎనిమిది మంది సీఆర్టీలు, ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులున్నారు. ఐదుగురు నాన్‌టీచింగ్ వర్కర్లు ఉన్నారు.

సరిపడని తరగతి గదులు..

పాఠశాలలో మొత్తం ఎనిమిది గదులు ఉండగా.. ఆరు తరగతి గదుల్లో ఎనిమిది తరగతుల బోధన సాగుతోంది. ఒక్కో తరగతి గదిలో రెండేసి తరగతులు బోధిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒక తరగతికి బోధించాల్సి వచ్చినప్పుడు మరో తరగతి విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని తరగతులు వరండాలో కొనసాగిస్తున్నారు. కిచెన్ రూం, డార్మెంటరీ లేకపోవడంతోనే ఇబ్బందులు తప్పడం లేదు. తరగతి గదులు, హాస్టల్ ఒకేచోట ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు తడుస్తూ.. భోజనం వడ్డించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలన్ని త్వరలో తీరనున్నాయి.

5 గదులు.. రూ.75 లక్షలు..

మండలంలోని రాంజీగూడ పాఠశాలకు సంబంధించిన నూతన భవన నిర్మాణ పనులు ధనోరా గ్రామానికి అతి సమీపంలో ఉన్న పునరావాస కేంద్రంలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రూ. 75 లక్షలతో ఐదు తరగతు గదుల నిర్మాణం (గ్రౌండ్ ఫ్లోర్) కొనసాగుతోంది. నూతన భవనంలోకి మార్చాలనే ఉద్దేశంతో పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే ఆ భవనంతో పాటే వంటగది, డార్మెంటరీ, ప్రహరీ కూడా మంజూరు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నర్సరీ పనులు పూర్తి చేయాలి



హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది

వాంకిడి: 2024– 25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల వారీగా ఏర్పాటు చేస్తున్న నూతన నర్సరీల పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు నాటేందుకు పాలీథిన్ కవర్లు రావడం జరిగిందని, ఎర్ర మట్టి, చెరువు మట్టి, ఎరువులు తెప్పించి బ్యాగు ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామాలలో శానిటేషన్ చేయించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. త్వరలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం మండలానికి రానుందని, రికార్డులు సరిచూసుకుని తనిఖీ బృందాలకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజుద్దిన్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం మెస్‌చార్జీలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి మెస్ చార్జీలు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో ఆడే ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. వసతిగృహాల మెస్ చార్జీలను పెంచిన ప్రభుత్వం ఎండీఎంను మరిచిపోయిందన్నారు. నిత్యావసర ధరలు నానాటికి పెరుగుతున్న నేపథ్యంలో ఎండీఎం చార్జీలను సైతం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, సంగీత, గణేశ్, బాలాజీ, సౌమ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అంబాల ఓదెలు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. గురువారం టీబీటీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందచేశారు. గత పదేళ్లుగా వేతనాలు పెంచకపోవటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. బ్లాస్టింగ్, బెల్ట్ క్లీనింగ్, సేల్ పిక్కింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలకు బదులు అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ నాయకులు సత్యనారాయణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు అందిస్తేనే సంస్థకు మనుగడ



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందిస్తేనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంతోపాటు, గోలేటి సీహెచ్‌పీలో ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాణ్యత వారోత్సవాలు ప్రారంభించారు. జీఎం కార్యాలయంలో నాణ్యత పతకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. జీఎం మాట్లాడుతూ నాణ్యమైన బొగ్గు అందించినప్పుడే సంస్థపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. సింగరేణికి దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని, దానిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బయ్యా మొగిళి, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, క్వాలిటీ ఇన్‌చార్జి రవి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ లేరు.. చిన్నారులు రారు



చింతలమానెపల్లి- 1 అంగన్‌వాడీ కేంద్రం

చింతలమానెపల్లి: విద్యార్థులకు పూర్వవిద్య, పౌష్టికాహారం అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. చింతలమానెపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో కొద్ది నెలల క్రితం ఉపాధ్యాయురాలు పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇక్కడ మరొకరు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నారుల హాజరు తగ్గింది. నిత్యం సుమారుగా 12 మంది వస్తుండగా గురువారం మధ్యాహ్నం సమయానికే అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. ఆయా తారను వివరాలు అడగగా.. టీచర్ లేకపోవడంతో చిన్నారులు ఉండడం లేదని తెలిపారు. ఈ కేంద్రం మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఉన్న ఆవరణలోనే నిర్వహించడం గమనార్హం. ఈ విషయంపై సూపర్‌వైజర్ శంకరమ్మను వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జూలూరి శేఖర్, అధ్యక్షుడిగా ఎనగందుల సందీప్, ఉపాధ్యక్షుడిగా విలాస్, ప్రధాన కార్యదర్శిగా దీపక్, కోశాధికారిగా హరిచరణ్, సంయుక్త కార్యదర్శిగా శిరీష్‌లను ఎన్నుకున్నారు.

‘సహకార’ వారోత్సవాలు ప్రారంభం



కౌటాల: జెండాకు వందనం చేస్తున్న సిబ్బంది



దహెగాం: జెండా ఎగురవేస్తున్న చైర్మన్

రెబ్బెన: మండలంలోని రైతులు సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. సహకార బ్యాంకు ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అజయ్ జైస్వాల్, సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం: అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సహకార సంఘం వారోత్సవాలను గురువారం నిర్వహించారు. సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతి గౌడ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, సెక్రటరీ నారాయణ, బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు ప్రదీప్, డైరెక్టర్ హైమద్ పాల్గొన్నారు.

కౌటాల: రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గురుడుపేట సహకార ప్రాథమిక వ్యవసాయ కార్యాలయం ఎదుట జెండా ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రుణాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం సీఈవో రాజేశ్, డైరెక్టర్లు శైలేష్, హరిదాస్, సిబ్బంది అమీర్ హుస్సేన్, ధీర్‌కుమార్, నాందేవ్ పాల్గొన్నారు.

రాంజీ సక్పాల్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: బీఆర్ అంబేద్కర్ తండ్రి రాంజీ సక్పాల్ సేవలు మరువలేనివని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో గురువారం సక్పాల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్‌ను మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దడంలో రాంజీ సక్పాల్ ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినేశ్ ఉప్రే, బౌద్ధ సమాజ్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, విజేయ్ ఉప్రే, నాయకులు ప్రశాంత్, రోషన్, ప్రతాప్, అరుణ్, బల్వంత్, సురేష్, శివాజీ, మనోజ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని గ్రూపు–3 పరీక్ష కేంద్రాలను గురువారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. వసుంధర డిగ్రీ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, సుప్రభాత్ స్కూల్, ఎస్టీ క్లారిట్ స్కూల్, జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం, ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

కొనసాగుతున్న సర్వే

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా గురువారం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 836 కుటుంబాలను సర్వే చేశారు. మండలంలో మొత్తం 10,037 కుటుంబాలు ఉన్నట్లు ఎన్యూరేటర్లు గుర్తించారు. 9వ తేదీ నుంచి గురువారం వరకు మొత్తం 4941 కుటుంబాలను సర్వే చేశారు. ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ సర్వేను పర్యవేక్షించారు.

రికార్డుల్లో నమోదు చేయాలి

కెరమెరి: విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తో పాటు ఎండీఎం, సీసీఈ, టీచర్స్ డైరీ రికార్డులను నమోదు చేయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని కెలికే పాఠశాలను సందర్శించారు. నాస్ రికార్డును పరిశీలించారు. వీక్లీ, మాక్ టెస్ట్‌లకు సంబంధించి రికార్డులు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఆరోగ్య విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖిరిడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అన్నం తినే ముందు చేతులు కడిగే పద్ధతులు, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్‌ఎం కృష్ణ కుమారి, వైద్య సిబ్బంది సౌమ్య, భగవాన్‌దాస్, లక్ష్మి, హెచ్‌ఎం శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.